అన్నదమ్ములు

[క థా ని క]

శ్రీ బలివాడ కాంతారావు

‘పరువునష్టంకావా వేసితీగాలి. మన పరువు ప్రతిష్ఠల్ని కులంలో యిలా కాల్చేస్తుంటే...’

‘బావగారూ! యెంత చిన్నవాడైనా యిలా సంచరిస్తుంటే యెంతకాలం సహిస్తారండీ? చిన్నమ్మ యిక్కి మహారాజులాంటి సంబంధం కాకుండాచేసిన వాడిని యేం చేసినా తప్పుందా?’

‘మీరందరూ వేద్దామంటే నా అభ్యంతరం యేమీ లేదు.’

‘అమ్మయ్య! యిన్నాళ్లకు వచ్చిందండీ అభ్యంతరం లేదన్నమాట! శాంతం, శాంతం అనే యింతవరకూ తీసుకవచ్చారు’ వియ్యంకుని వేపు తిరిగి ‘యీ కష్టాలు యిప్పుడు అనుభవించేది మనమేకదా అన్నయ్యా! చేతులారా కట్టించిన రెండంతస్తుల మేడ దానం చేశారు!’

‘పోనిద్దూ చెల్లమ్మా! మేడకన్నా భూఆస్తే యెంతో లాభం. మరికొన్నాళ్లలో మనం ఒక మేడ కట్టించలేమా?’

‘మనుషు లిలాంటివారని చెప్తున్నా నన్నయ్యా! ఇంటిపెద్ద కళ్లు మూసే గుర్రపుకాసులు కొని దాచే వాడే. అల్లుడిచదువుక్రింద అంత డబ్బు తగలేశాడే— యేదీ సమిష్టి. వాళ్ల మనసుల్లో కుళ్లు వుంచుకొని వాళ్ల బాగు వాళ్లు చూసుకుంటూవుంటే యీయన కెందు కా తిన్ననని? తమ్ముడు అడగటంతో సరి, మేడ దానం. చేశారు.’

‘రత్నం! పోనీయవే. శేరైపోయినా మన కేం లోటొచ్చింది?’

‘లోటు లేదండీ? ఆయన స్వంతయింట్లో వున్నాడు. నేడో రేపో కారు కొంటారట! మనం యెందుకు కొనలేం? మనకీ అద్దెకొంపగతేమిటి? మీ ధర్మమా అంటూ పైకొచ్చి, మీ గుండెనే బాకు నాటాడు. ఇంకా తమ్ముడనే అభిమానం చావదు’ వియ్యంకుని వేపు తిరిగి ‘తమ్ముడు విడిపోతానని, ఆస్తి పంచమని బలవంతం చేసేవరకు నే నొక దెయ్యంలా కనిపించా నన్నయ్యా.’

ముక్కాళ్ల ముదుసలి; ముఖంనిండుగా పట్టె వర్ధనాలతో వరండాదగ్గర ఆగాడు.

‘ఆలస్యం యెందుకూ? నాతల్లి కడుపులో చిచ్చుపోసినవాడు నా మర్దట. రేపే దావా వెయ్యాలి’ రత్నమ్మ పౌరుషవాక్యాలను జారవిడిచింది.

‘ఎందుకమ్మా యీకక్షలు ఒక్క తల్లిబిడ్డల్లో? విభక్తం అయిపోయారుకదా, పాతరోజులు మరిచి పోయి మంచిగా వుండండమ్మా!’

‘మధ్యను మీ రెండుకు పుల్లంటి బిడ్డలా. ఇక్కడి వక్కడ పెట్టండి. రామా కృష్ణా అని ఒక మూల కూర్చోక.’ కటుస్వరంతో అన్న మాటలు విన్న వకీలు చుట్టపొగమధ్యనుంచి ఒకసారి ఆశ్చర్యమైన చూడ్కులను ప్రసరించి యేదో అనబోయి ఆగి పోయాడు.

టక్ టక్ మనే శబ్దంతో త్రోవ చూపించింది చేతిలోని కర్ర. గదిలోనికి పోయి తన మంచంమీద చారగిలబడ్డాడు ముదుసలి.

౨

'ఏడుస్తున్నా వేం తాతయ్యా! అమ్మ అన్నం పెట్టలేదా?'

'ఆకలి లేదు నాయనా'

'ఆకలిలేనిదే యేడుస్తా వేం తాతయ్యా?'

ఒడిలో కూర్చున్న ఐదేళ్ల మనుమడిప్రశ్నకు యెనభై యేళ్ల తాతయ్య జబాబీయలేకపోయాడు.

'చాకలెట్ యిస్తాను, వూరుకుంటావా తాతయ్యా?'

తాతయ్య తల కాస్త ప్రక్కకు త్రిప్పగానే తను తాతయ్యపేరు చెప్పి ఒక ముక్క తినొచ్చని ఒడిలో నుంచి దుమికి పరుగెత్తాడు.

'అమ్మా, అమ్మా! తాతయ్యకి చాకలెట్ కావాలటే'

'అబ్బా! ఉండరా...బడికి వేళైంది. వెళ్లు'

'తాతయ్యకు చాకలెట్ యిస్తే మరి యేడవడే'

'తాతయ్య యేడుస్తున్నారా?'

'నిజంగా యేడుస్తుంటే—చాకలెట్ యిస్తే'

రత్నమ్మ మామగారి గదిలోనికి వెళ్లింది.

'యీ యింట్లో యీదురోమని యెందుకీ రోదనం? యిక్కడ కొంతసేపు, అక్కడ కొంతసేపు. యే కొడుకునో ఒక్కడిని నమ్ముకొని వుండరాదూ?'

'యిద్దరూ నాకొడుకు లనే అభిమానం కొల్పుకో లేనమ్మా!'

'అభిమానం. అభిమానం! అయితే యెప్పుడూ మాకీ గోల యెందుకూ?'

'నాసిథిలో వుంటే నాకడుపుకుంట తెలుసు కొనివుందు వమ్మా.'

'మంట! యీయేడు పెందుకు మాయింట్లో. మీకొడుకుకుటుంబం నిలవాలా?'

'రామరామ! వూరుకో అమ్మా, వూగుకో. ముసలివాళ్లకు దేవుడు అన్యాయం చేస్తాడు. కన్నీరు తప్పించి మిగతావన్నీ కరువుచేస్తాడు. ఆ కన్నీరుకూడా కరువుచేసుంటే నీమున స్వంత కష్టపడేది కాదు.'

'యేమన్నా నే చెడ్డదాన్ని. నిజం ఆడితే నిష్ఠూరం. చిన్నకొడుకుమీద అంత అభిమానం వుంటే యిక్కడి కెందుకు రావటం? అక్కడే వుండండి.'

పైమీది గావంచాతో కళ్లు ఒత్తుకొని 'ముసలి వాళ్ళు పిల్లలతో సమానం అమ్మా. కాలానికి పక్షపాతం వుండదు. అందరిమీదా దాని ప్రాభవాన్ని చూపిస్తుంది. ఒకనాడు నాకంట పడని కోడలివి యీనాడు నా బాగోగులు స్వయంగా చూస్తున్నావంటే అది కాలప్రభావం కాదమ్మా. వెళ్లమ్మా, బాబుని తలదువ్వి బడిలోకి పంపించు' అంటూ లేచి వీధి అరుగుమీదికి పోయి కూర్చున్నాడు—కోడలు యేదో గొణుక్కుంటున్నా వినిపించుకోకుండా.

3

ఒంటిగా మేడ యెక్కలేడు. యెవరైనా తోడుండాలి. మనుమరాలు రాధ గబగబా మెట్లు దిగి తాతయ్యదగ్గరకు వచ్చింది. పలుచని తెల్లైన శరీరం, ప్రశాంతమైన ముఖవర్చస్సు, ప్రేమ వుట్టిపడే మాటలూ— ఆ మెభుజం వూతపట్టుకొని మేడ యెక్కాడు. రత్నమ్మకుకూడ రాధ అంటే అదొక వెర్రిప్రేమ—చాలా మంచిపిల్ల అని.

పడమటి సూర్యుని పవిత్రకిరణాలు తాతయ్య పాదాలపై పడి ప్రకాశిస్తున్నయ్.

'మనంకూడా వేద్దాం దావా. యెవరైతే నేం? కావలసింది న్యాయం.'

'వద్దండీ. మీరుకూడా కోర్టుక్కితే నలుగురూ ఛీ ఛీ అంటారు.'

'నోరు ముయ్. వాడు నా కన్నయ్యట! నా పిల్లకీ, నాకూ ద్రోహాన్ని తలపెట్టాడు.'

'అవన్నీ మరచిపోండి. విడిపోయాంగా.'

'యెందుకు నాయనా, ఒకతల్లి బిడ్డలు యిలా కొట్లాడుకుంటారు?'—అక్కడే వున్న తండ్రి కలుగ జేసుకొని హితవును బోధించాడు.

'యిందులో కొట్లాట యేం వుందండి? వాడి పిల్లలకి పెద్దపెద్ద సంబంధాలుచేసుకొని ఒకే ఒక నా పిల్లని పేదయింటిలో పడవేస్తాడా? పెద్దవాడు-యింటి యజమానికి యిది సబబుగా వుందండీ.'

'ఆ పిల్లల అదృష్టంరా అది. పేదయింటిలో పడవేసినా నీఅల్లుడికి వచ్చిన లోటేమిటి? సర్కారు వారి డాక్టరు; బుద్ధిమంతుడు. మొగసంతానం లేనందుకు ఆ పేదయింటిపిల్లడు కాబట్టి యిల్లరికం వచ్చాడు.'

'నేను కలుగజేసుకొని చదివించబట్టి సరిపోయింది. లేదా అంటే మీ రిలా ఆ కొడుకుపక్షాన మాట్లాడకపోయిందురు.'

'నిన్ను వృద్ధిలోనికి తెచ్చిందివాడే కదరా బాబూ! సమిష్టిగా వున్నపుడు యెవరు చదివిస్తే యేమిటని వూరుకున్నాడు. మధ్యనున్నవాళ్లు యిక్కడి వక్కడ, అక్కడి విక్కడ పెడతారురా. మాటవరసకి అనుంటాడు. నిజంగా వాడు దావా వేస్తాడురా? కోర్టులెక్క డబ్బు తగలెయ్యటమే కాదు—పరువు నష్టందావా వేస్తే వున్న పరువును కాల్చేసుకుంటారు.'

'మీరు తెలీదు, వూరుకోండి.' కసురుతూ అన్న యీమాటల్లో విద్యుత్తు వుత్పత్తియై షాక్ తగిలినట్లనిపించింది. మెల్లగా లేచి మనుమరాలి గదిలోనికి పోయాడు. కళ్లలో నీరునింపిన రాధప్రక్కనే కూర్చొని ఆప్యాయంగా—

'యేమమ్మా రాధా! అలా...'

'తమ్ముడు రోజూ వచ్చి పెద్దక్క పెద్దక్క అని విడిచి పెట్టేవాడు కాదు తాతయ్యా. నిన్నటి నుంచి రానే లేదు. పెద్దమ్మ వెళ్లొద్దందేమో?'

'అయ్యో! తల్లీ! యింతా డబ్బుప్రభావమమ్మా. తల్లీ పిల్లలనీ, అన్నాతమ్ములనీ, అభిమానులనీ వేరుచేస్తుందమ్మా యీ హెచ్చుడబ్బు!'

౪

చలికాలం. సూర్యుడు కొంచెం మీదికి లేచాడు. చన్నీటిలో స్నానంచేసి గజగజ వణికిపోతున్నాడు తాతయ్య. 'రామా, కృష్ణా, కేశవా, నారాయణా...' అని బోసినోటితో వుచ్చరిస్తూ గదిలోకి పోయి ముఖాన్న పట్టెనామాలు దిద్దుకున్నాడు చేతిలో వణికే చిన్న అద్దాన్ని చూస్తూ.

'వేడినీరు స్నానం చేయలేకపోయారా?'

'వేడినీరు కృత్రిమమైనది నాయనా. స్నానం చేసినంతసేపూ వెచ్చగా వుంటుంది. తరువాత చలే కదా—నాయనా, యిలా ఒక్కసారి వస్తావురా?'

పెద్దకొడుకు తండ్రిదగ్గర కూర్చున్నాడు.

విరక్తిలేని కంఠస్వరంతో ఆప్యాయంగా అన్నాడు—'బాబూ! బుద్ధిమంతుడివి. న్యాయశాస్త్రం చదువుకున్నావు. తొందరలేదు. బాగా ఆలోచించి చెప్పు, నన్నేయింట్లో కాలం చెయ్యమంటావో?'

కొడుకు మొదట విస్తుపోయినా తరువాత ఆ ప్రశ్నలోని వ్యంగ్యాన్ని అర్థంచేసుకొని సిగ్గుతో తలదించాడు.

'తొందర లేదు. అవసరం వుంటే ఆఫీసుగదిలోని ఆ పుస్తకాలన్నీ తిరగవెయ్ నాయనా.'

చేతికర్ర త్రోవ చూపించింది. నడుంవంగిన నాన్న నడకను చూస్తూ అలా కూర్చుండిపోయాడు కొడుకు.

'పేరుపొందిన వైద్యుడివి. వూరిలో అందరి జబ్బులూ బాగు చెయ్యగలవేమో కాని నీనాన్న రోగాన్నే కనుక్కోలేవు. మరి నన్నెక్కడ కాలం చెయ్యమంటావ్? నీయింట్లోనా, నీఅన్నయ్యయింట్లోనా? తొందరలేదులే. బాగా ఆలోచించి చెప్పు నాయనా!'—యీమాటలు విన్న చిన్నకొడుకు మొహంలో చెప్పతలసిన మార్పేమీ గోచరించలేదు. పైగా ఆ మాటలు సరిగ్గా వినిపించుకోలేదనవచ్చు. ముసలివాళ్లు యేదో పిచ్చివేదాంతం మాట్లాడతారని ఆ ఎల్. ఎమ్. పి. డాక్టరు నమ్మకం!

౫

బ్యాండుమేళం. యింటినిండా చుట్టాలు. చాలా సందడిగా వుంది. తాతయ్య వీధిఅరుగుమీద కూర్చున్నాడు. 'నాయనా, యిలా రా' అని పిలిచాడు తాతయ్య. 'పెద్దవాడివి, తప్పు చెయ్యకురా' అన్నాడు. అడ్డుగా వచ్చింది కోడలు: 'మీరు వూరుకోండి. యిక బుద్ధులు చెప్పక్కరలేదు. కూతురుకడుపులో చిచ్చుపోసినవాడిని కూతురుపెళ్లికి తగుదునమ్మా అని వెళ్లి పిలుస్తాను?'

'శుభకార్యమమ్మా. యీక్షణమైనా విభేదాలు మరచిపోండి.'

'ఆయనమాటల కేమిటి? యిద్దరం యిక్కడ వుంటే యెలా? రండి' తీసుకపోయింది భర్తను రత్నమ్మ.

'ఒరే నరిసింహులూ, యిలా రా నాయనా... పెద్దకుటుంబీకుడివి. యీనాటికైనా ఆలోచించురా. నీవియ్యంకుడేని యెలాగైనా చిన్నవాడిదగ్గరకు వెళ్లి పెళ్లికి రమ్మని పిలమనరా.'

'నామాట వింటారండీ మామయ్యగారూ ?'

'అయ్యో నాయనా! మధ్యను మీలాంటివాళ్లుండి వాళ్ళ మనసులు మరీ పాడుచేస్తున్నారురా!' యెగ్జిరించి ఒకసారి చూచి వెళ్ళిపోయాడు నరిశింహులు.

౬

'ఆరోగ్యం మహాభాగ్యం నాయనా. ఇంత రాత్రివరకూ ఆపుస్తకాలు తిరగవేసుక కూర్చోకు.'

. 'రేపు ఒకకేసు వుందండీ...'

'నాయనా! అమ్మాయిపెళ్లి అయిపోయింది కదరా' అంటూ యెదురుగా కుర్చీమీద కూర్చున్నాడు తండ్రి.

'బుద్ధిమంతుడివి. వున్న ఆస్తిఅంతా నీఒక్కడి చదువుక్రిందే యెందుకు పెట్టాను? నా తను వుండగా యిద్దరూ యిలా ద్వేషంతో మెలగటం చూడలేక పోతున్నాను. దాఖలుచేసిన కేసు వుపసంహరించుకో నాయనా.'

'వా డింకా చిన్నవాడండీ? పిల్లకు అంత గొప్పయింటి సంబంధం స్థిరమైతే యెలా విఘ్నం చేశాడో మీకు తెలీదా? అంతతో వూరుకోకుండా మే మేదో మాలకూడు తినేస్తున్నామనీ, మాయిల్లు సాని కొంపనీ అంటూంటే యెలా సహించమంటారండీ!

'నీయెదురుగా అన్నాడా? పోనీ, అన్నాడే అనుకొందాం. వాడుచేసిన పాపానికి శిక్షించేవాడు శ్రీమన్నారాయణమూర్తి వుండగా మానవమాత్రుడవు నీవు దేవునిపని చేస్తా ననటం బాగాలేదు. నీ తిన్నసైన త్రోవలో నీవు పో బాబూ. విద్వేషాలు పెరగటం వలన లాభం యెప్పుడూ వుండదు. తొందర లేదు. బాగా ఆలోచించు. నీ అంతరాత్మను ప్రశ్నించు.'

తండ్రిమాటలకు మౌనాన్ని దాల్చాడు.

'నాయనా! కాలం దగ్గరపడిందిరా. యీవేళ చెప్పవా, నన్నే యింట్లో కాలంచెయ్యమంటావో ?'

కొడుకు తల దించాడు. సమాధానం తోచక కొమోసు. పొంచి వింటున్న రత్నమ్మ రంగంలోకి దిగింది. 'ఆ కాలానికి మన యిష్టాయిష్టాలు పనికి వస్తాయా? కొడుక్కి బాగా వేదాంతం బోధపరుస్తున్నారు. సన్యాసులం కాం!'

మెల్లగా లేచాడు. 'అమ్మా! పులి చాలా క్రూరమృగమమ్మా. తన పిల్లలను చంపి తినటానికికూడ జంకదు. విద్వేషం ఆవరించిన మనిషి అలాంటివాడే. నీ ఒక్కకొడుకు తప్పుచేస్తే, క్షమిస్తావా లేదా? నీ ఒక్క మరిదీ కొడుకుతో సమానం కాదమ్మా — క్షమించలేవా ?'

'చిన్నకొడుకు ముద్దు. ఏం అనలేరు. ఎటొచ్చీ మేం మెత్తగా కనిపిస్తున్నాంగా' రత్నమ్మ కటు స్వరంతో అన్న మాటలకు భర్త వెంటనే 'రత్నం! వూరుకో' అన్నాడు మందలింపుస్వరంతో.

'వినేవాడికే చెప్పాలని వుంటుందమ్మా. యీ కేసుల్లో ఫలానావాడి కొడుకు లంటారే తల్లీ' అంటూ గదిలోనుంచి వెళ్లిపోయాడు.

౭

'ఒంటిగంట దాటింది. యింకా నిద్దరపోరండీ' యెలుగెత్తి యేకకంఠంతో దైవప్రార్థన చేసుకొంటున్న తండ్రిగదిలోనికి వచ్చి ప్రశ్నించాడు పెద్దకొడుకు.

'నాయనా! నిద్ధపోయేబదులు ఆ కాలంలో ఆ దేవుడ్ని ప్రార్థిస్తే నే చేసిన పాపాలను క్షమిస్తాడు.' మరల ప్రేమ వుట్టిపడే స్వరంతో తల దించియున్న కొడుకు వేపు చూస్తూ 'చిన్నబుచ్చుకోకురా నాయనా. నిన్ను ఆస్తిపాస్తు లమ్మి చదివించటంవల్ల యీపాపం అంతా నాకే చుట్టుకుందిరా. పెద్దకొడుకు చదువుకొని జ్ఞానవంతుడై పొట్ట పోషించుకొని చిన్నవాడిని పైకి తెస్తాడు; యిద్దరూ సఖ్యంగా వుంటా రనుకున్నానురా. కాని యింకోలా జరిగింది. చదువు చెప్పించకపోయినా, ఆ నాగలిని నమ్ముకొనైనా సఖ్యంగా వుందురేమో? న్యాయశాస్త్రం నీకు న్యాయదృష్టిని ప్రసాదిస్తుందనుకొన్నా-కాని...'గొంతులో కంపం బయలుదేరింది.

కొడుకుశరీరం ఝల్లుమన్నది. తను అపరాధం చేశానని బాధపడ్డాడు. తండ్రిమీది సహజమైన అభిమానం, భక్తీ కట్టలు తెంచుకొని ప్రవహించింది. దగ్గర కూర్చున్నాడు.

బిగబట్టిన పెదిమలు దగ్గరగా వచ్చిన కొడుకును చూడగనే విడిపోయాయ్. గడ్డకట్టుకుపోయిన ఆవేదన

కొడుకు ప్రసరించిన తీవ్రకరుణాదృష్టులకు కరిగి అశ్రు రూపంలో రాల సిద్ధంగా వుంది.

'నీ తాతముత్తాతలనుంచీ న్యాయానికి పేరు పడిందిరా మన వంశం. నీ తాత ఆముదందీపంయెదుట చదివించిన రామాయణభారతాలలోని సారంతో యీపొట్ట చల్లగా వుండేది. కాని, యీ ముడుతలుపడిన పొట్ట యెంతగా మండిపోతున్నదో చూడు నాయనా' అంటూ కొడుకుతలను అభిమానంతో పట్టుకొని పొట్టకు ఆన్చాడు.

శ్వాస బిగబట్టి అంతవరకూ దుఃఖాన్ని ఆపుకున్న న్యాయవాదికళ్లు తడిసిపోయినై. ముఖం సిగ్గూ, ఆవేదనల్లో మునిగిపోయింది. జారిన రెండేరెండు కన్నీటి బిందువులు ముడుతల మధ్యనుంచి వడిగా జారి పోయాయ్.

మెల్లగా లేచి కూర్చున్నాడు తండ్రి. కొడుకు కన్నీటిని తుడిచి 'యెప్పటికైనా న్యాయానికి కట్టు బడతావని యిన్నాళ్లూ వూరుకున్నాను' తండ్రిమాటలకు హఠాత్తుగా మధ్యనే అడ్డి అప్రయత్నంగా చేతులు జోడించి 'క్షమించండి. కేసు వుపసంహరిస్తాను. రెండో విషయం, మీ కలా న్యాయమని తోస్తే అలా చెయ్యండి' అంటూ నాన్నమీది అభిమానం ఆయన కాళ్లను బంధించినా తను వంశానికి అపకీర్తి తెచ్చా ననే బాధ పిశాచమై వెంటతరిమింది. తన గదిలో పరుపుమీద పడి హృదయాన్ని గట్టిగా నొక్కి పట్టుకున్నాడు.

౮

చిన్నవాడికి యెన్నివిధాల చెప్పినా వినిపించుకో లేదు. మొదట కేసువేసింది నీవేకదరా? లేనివి కల్పించి వాడిమీద అలా అనవసరంగా విరుచుకు పడ్డావ్. కృతఘ్నుడివిరా. నీయింట్లో నేను చావలేను. నాకు ఒక్కడేకొడుకును దేవుడు ప్రసాదించా డను కుంటాను' హృదయం విప్పిచెప్పి పెద్దకొడుకుయింటికి చేరుకున్నాడు.

రత్నమ్మ వియ్యంకుని యింటినుంచి తిరిగి వచ్చింది. ఆరాత్రి గదిలో భార్యతో అన్నాడు— 'రత్నం, భూమి అమ్మటం నా కిష్టంలేదు. అంత బంగారం నీవు మోయలేక పోతున్నావ్. కాసులపేరు, వడ్డాణం నా క్కావాలి.'

రత్నమ్మ యీమాటలు విని చకితురాలయింది. 'అలా చూస్తావేం? నీకు డబ్బు ప్రధానమా? వంశ మర్యాద నిలపటం ప్రధానమా?' అని ప్రశ్నించాడు.

రత్నమ్మ స్తబ్ధురాలైంది. ఆమెజవాబుకు యెదురుచూడకుండానే అన్నాడు: 'నాకు కావలసింది యీ వంశమర్యాద నిలపటం. యెవరు అడ్డురానీ నా త్రోవలో నే పోతాను.' ఆరాత్రి స్వార్థం గెలిచా ననుకుంది. కాని అది నైతికవిజయం కాదు.

వేకువజామున తండ్రి హరినామస్మరణ వినగానే 'ఛీ! స్వార్థానికి త నెప్పుడూ తలవంచి దాసోహం అన'నని భీష్మించుకున్నాడు.

గృహంలో భీకరసంగ్రామం జరిగింది. అకస్మాత్తుగా తగిలిన చెంపపెట్టుతో రత్నమ్మ అలా కూర్చుండిపోయింది.

'నాయనా! తప్పురా. గృహలక్ష్మి!' అంటూ కేక వేసి చెవులు మూసుకున్నాడు ముసలి.

బంగారం అమ్మి ఒకవేయి కోర్టులో కటి తిరిగి వచ్చాడు. కేసులగొడవ పోతే తను హాయిగా యీ లోకం విడిచిపెట్టవచ్చని తండ్రి ఆశించాడు. కాని, యీ గృహకలహం దావానలం అయింది. ఆశతో బ్రతికే గృహిణిని యిల్లువిడిచి పొమ్మన్నాడు.

ఈగలభా చూచి మృత్యువులోనే తనకు శాంతి వస్తుందని ముసలిమస్తిష్కంలో ఆలోచన ప్రవహించింది. మూతిపోటులు తప్పించి,కర్ణకఠోరమైన మాటలకు గుండె పగిలి పెద్దపెట్టున యేడ్చుకుని కుమిలి పోయాడు. యిదంతా ఆశయొక్క ప్రభావమని సంభా వించుకుని కొడుకున్యాయప్రవర్తనను శ్లాఘించి కోడలు చేసిన అపచారాన్ని మరచిపోడానికి ప్రయత్నించేవాడు.

తమ్ముడు కేసు వుపసంహరించలేదు. వాదనల వరకూ వస్తే వంశమర్యాద భస్మమైపోతుంది. అన్నయ్య తమ్ముడు కల్పించిన నేరాలకన్నిటికీ ఒప్పుకున్నాడు. నగ లమ్మి పరువునష్టానికి పరిహారం కట్టాడు. యీ గృహకలహానికి యిదీ యెదురుగా కనుపించే కారణం!

౯

లోకులు చేతు లెత్తి నీది తప్పని చూపించ కుండా తనే స్వయంగా వెళ్లి తమ్ముని పిలిచాడు మృత్యుముఖంలో వున్న తండ్రిని చూడటానికి రమ్మని. రాలేదు సరిగదా, తను భరించలేకపోతే తనయింటికి పంపించమన్నాడు. యీమాటలు నిండుచూలాలు రాధకూ, అల్లునికీ కష్టాన్ని కలిగించాయ్. కాని, ఆ రాక్షసునిదగ్గర ఆ వడిలో యెదురాడే ధైర్యం వారికి లేకపోయింది.

తనూ స్మశానానికి వెళ్లాడు. తనూ తనయింట్లో శ్రాద్ధంచేశాడు. తనపని అంతా తనకు తిన్నగానే వుంది. యింట్లోవారే హర్షించలేకపోయారు. ఎందు కీ ద్వేషం? కొందరు కళ్లు తెరిచి చూస్తారుగాని, నిదానం అలవరచుకోరు. ఎదురుగా వున్న గోముఖ వ్యాఘ్రాన్ని గోవు అనుకుంటారు. గట్టివాళ్లమని గింతే యీరకంవాళ్లను యెలా కబళించటమో ఆ వ్యాఘ్రానికి తెలుసు!

తండ్రి చెప్పిన మాటలయందు విశ్వాసం వుంది ఐనా దేవుళ్లకు మ్రొక్కటం మానలేదు. రత్నమణి విషాక్తమయిన హృదయాన్ని మామయ్యగారి తదనంతరం మధుసిక్తం చేయవలసివచ్చింది. చెయ్యక విధి లేదు. ఇక యెవరిమీద ఆ విషబిందువుల వర్షం కురిపిస్తుంది? భర్తమీదనా? నన్ను బ్రతకనీయ్ అంటాడు. తండ్రిని తలుచుకొని చిన్నపిల్లాడిలా కన్నీరు కారుస్తాడు. లాలించవలసిన భార్య యింకేం కోపాన్ని చూపిస్తుంది?

'రాధను ఆస్పత్రిలో వేశారు. చాలా కష్టపడుతోంది. వెళ్దామా?' అని భార్యఅనుమతిని కోరాడు. త్రోవలో 'రత్నం! రాధంటే నీకు ప్రేమకదూ. అలాంటి మంచి కూతురుకు యెలాంటి ఆపద వచ్చిందో. నాన్న చెప్పారు. దాని ప్రాణానికి యేం అపాయం వుండదు' అన్నాడు వకీలు భార్యతో. ఆసుపత్రిలో పెద్దక్కా అని పరుగెత్తబోయాడు కుర్రవాడు. కొద్ది నిముషాలలోనే పెద్దక్కకు పాపాయి పుట్టిందని గంతు లేశాడు.

శివాలయంలో అన్నదమ్ములు ఒకేనాడు యెదురవవలసివచ్చింది. అన్న ముఖం కళగా వుంది. తమ్ముని ముఖం ధుమధుమలాడుతోంది—కుమార్తెకు లేక లేక కలిగిన సంతానం ఆడపిల్ల అవటంచే ఆశాభంగం కలిగింది. రాధ పెదనాన్నను, రత్నమ్మను విడువలేకపోయింది. ఆమెకోసమేగా యీ పూజాపురస్కారాలన్నీ.

నాలుగు నెలలు గడిచాయ్. మా ముఖం చూచైనా క్షమించమని రాధ భర్తతో వచ్చి రత్నమ్మను, పెద్దనాన్నను బ్రతిమాలింది. ఒకేఒక పుత్రునిమీదనున్న ప్రేమకొద్దీ రత్నమ్మ గట్టిగా యేడ్చింది. న్యాయవాది ముఖంలో చిరునగవే తాండవిస్తోంది. వాళ్ల నుద్దేశించి అన్నాడు:

'కాబోయే పెళ్లాన్ని చూడాలన్న ఆశతో మనవాడు దొంగతనంగా యెందుకు వెళ్లాడు?'

గాయాలకు కట్టిన కట్లతో వున్న కుర్రవాడికి తెలివివచ్చి కళ్లు తెరవగా కనపడ్డ రాధను 'పెద్దక్కా' అని ప్రేమపుట్టిపడే స్వరంతో కేకవేశాడు. రాధ తమ్మునిదగ్గర కూర్చుంది. తమ్ముడు, యింటికి రావద్దని మందలించినా దొంగతనంగా వెళ్లి పెద్దక్క కూతురు రోహిణి వుయ్యాలదగ్గర కూర్చొని వూసులాడేవాడు. కాని ఆనాడు మెట్లు దిగుచుండగా చిన్ననాన్నకు దొరికిపోయాడు. ఆయన వేసిన కేకకు హడలిపోయి మెట్లమీదనుంచి క్రిందికి దొర్లాడు. గాయాలు తగిలాయ్.

న్యాయవాది తాతయ్యకోరకను యెఱుకపరిచాడు. 'దాని వయసెంత నాన్నా. అయినా కాదనటానికి మానో రెలా వస్తుంది?' అని ముక్తసరిగా తేల్చింది రాధ పొంగిపొరలే ఆనందాన్ని కప్పిపుచ్చటానికి ప్రయత్నిస్తూ.

యీ సంఘటన జరిగిన పదిహేనేండ్లతరువాత విషయం: ఇంటియజమాని కళ్లుకప్పి దాచిన డబ్బుతో కొన్న కారులో ఆ యజమానికొడుకు స్వేచ్ఛగా తిరుగుతున్నాడు భార్య రోహిణితో. దాచిన గుర్రపు కాసులతో చేయించిన నగలు అన్నయ్యకోడలి ఒంటనున్నాయ్. అన్నయ్య చేతులారా ధనం వెచ్చించి కట్టించిన మేడలో అన్నయ్యకొడుకుదే సర్వాధికారం. తమ్ముడు విద్వేషాన్ని పెంచి న్యాయానికి కట్టుబడక ఆర్జించిన ఆస్తిపాస్తులకు వారసుడు అన్నయ్యకొడుకే అయ్యాడు.

ఒకనాడు వెలిగే ప్రపంచం యీనాడు ఆయన కంటికి గాఢాంధకారం. ఒకరోజు ఆనందసముద్రములో మునిగిపోయినవాడు యీరోజు శాశ్వతమనఃక్లేశంతో కూర్చుంటాడు రెప్పలు ఆడిస్తూ. తెల్లవారేక స్నానం చేయించి, తూరుపుదిశ మోము త్రిప్పి భార్య కూర్చోబెడితే, చేతు లెత్తి సూర్యభగవానునకు నమస్కరిస్తాడు, నేత్రదానం చేయమని కామోసు-కాలవశమున మశూచివలన గ్రుడ్డివాడైన తమ్ముడు. ఆ దృశ్యాన్ని చూచి అన్నయ్య విచారిస్తాడు. రాధా, రోహిణీ కళ్లంట నీరు తెచ్చుకుంటారు.

కాలం శాసించిన శాసనాన్ని ధిక్కరించే తాహతు మానవునికి లేదు. అనవసరవిద్వేషాన్ని పెంచినవాడు న్యాయానికి కట్టుబడలేదు. న్యాయానికి కట్టుబడలేనివాడు దుర్బలుడు. వానికి పరాజయం తథ్యం!